సాక్షి సంగారెడ్డి
ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024

ఫ్లాష్ మాబ్ కొత్త ట్రెండ్

రోడ్లపై విద్యార్థుల నృత్యాలు

- వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన
- రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ
- పట్టణాల్లో జోరందుకున్న నూతన సంస్కృతి

సండే స్పెషల్





విద్యార్థులు రోడ్లపై డ్యాన్స్‌లు చేస్తున్నారేంటి అనుకుంటున్నారా.. ఇలా డ్యాన్స్ వేయడం వెనుక ఓ సదుద్దేశం ఉంటుంది. ఒక అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు యువత, విద్యార్థులు ఫ్లాష్ మాబ్‌ను ఎంచుకున్నారు. గతంలో కరపత్రాలు, ఫ్లెక్సీలు, ప్రకటనలు చేసేవారు. ఇది ఖర్చుతో కూడుకున్నప్పటికీ పెద్దగా ఫలితం లభించేది కాదు. దీంతో విద్యార్థులు వినూత్నంగా ఆలో చించి ఫ్లాష్ మాబ్‌తో ప్రజల ముందుకు వస్తున్నారు. ఈవెంట్‌లు, ఫెస్ట్‌లు, వార్షికోత్సవాలతోపాటు ప్రజలకు ఏదైనా అంశంపై తెలియజేయడానికి ఎక్కువ రద్దీ ఉండే ప్రాంతాలు ప్రధాన చౌరస్తాలు, బస్టాండ్‌లు ఎంచుకొని నృత్యాలు చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో యువత, విద్యార్థులతోపాటు వైద్యాధికారులు, పోలీసులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు భాగస్వామ్యం అవుతున్నారు.

8లో

– గజవెల్లి షణ్ముఖ రాజు (సాక్షి, సిద్దిపేట):

న్యూస్‌రీల్

దేశం గొప్ప మేధావిని కోల్పోయింది



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: దేశం ఓ గొప్ప మేధావిని కోల్పోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా 72 మీటర్లతో కూడిన రెడ్ క్లాత్‌తో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రజా సమస్యలను వెలికితీయడంలో, వాటికి పరిష్కార మార్గాలను సూచించడంలో ఏచూరి ముందుండేవారన్నారు. మతతత్వ రాజకీయాలు దేశానికి ఎంతో ప్రమాదకరమని హెచ్చరించేవారని పేర్కొన్నారు. అలాంటి రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా లౌకిక రాజకీయాలను ముందుకు తీసుకురావడానికి ఆయన చివరివరకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, మాణిక్యం, సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మి, నర్సింలు, ప్రవీణ్, యాదగిరి, నాయకులు అశోక్, బాల్‌రాజు, నర్సింలు, కృష్ణమూర్తి, రాజు, విజయ్, శాంత కుమార్, సంజీవ్, ఏజాజ్, సురేష్ పాల్గొన్నారు .

క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పట్టణంలో శనివారం బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి మాట్లాడుతూ 70 ఏళ్ల వయసు పైబడిన సీనియర్ సిటిజన్స్‌కు ఆయుష్మాన్ భారత్ అమలు చేయడం సంతోషకరమైన విషయమన్నారు. వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులకు చికిత్స చేయించలేక అనేక మంది ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి గుర్తించిన ప్రధాని రూ.5 లక్షలతో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వెంకట నరసింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మాణిక్ రావు, నాగరాజ్, దోమల విజయకుమార్, ద్వారకా రవి, ప్రవీణ్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, మీనా గౌడ్, లక్ష్మణ్ గౌడ్, రాములు, మల్లేశం, బాలరాజ్, మధు పాల్గొన్నారు.

రాజకీయాలపై ఆసక్తి ఉంటే ప్రోత్సహించాలి



పురస్కారాలు అందజేస్తున్న విశ్వప్రసాద్, రాంమోహన్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: పిల్లలకు రాజకీయాలపై ఆసక్తి ఉంటే ప్రోత్సహించాలని హైదరాబాద్ అడిషనల్ ఎస్పీ విశ్వప్రసాద్ అన్నారు. పట్టణంలోని దత్తగిరి కాలనీ బసవ మండపంలో వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, పదోన్నతి, పదవి విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించారు. సంఘం అధ్యక్షులు నాగేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి టౌన్ సీఐ శివలింగం, వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ శెట్టి, బస్వరాజ్, మల్లయ్యస్వామి, సింగితం చంద్రశేఖర్, శ్రీపాల్, మల్‌శెట్టి, సిద్దన్న, శాంతకుమార్, శంకర్‌పాటిల్, మధుశేఖర్, సుభాష్ పాల్గొన్నారు.

చేపల వలలో కొండచిలువ

అక్కన్నపేట(హుస్నాబాద్): చేపల కోసం వేసిన వలలో శనివారం భారీ కొండచిలువ చిక్కింది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామ పాతచెరువులో చేపల కోసం మత్స్యకారులు ఏర్పాటు చేసిన వలలో కొండ చిలువను గుర్తించారు. ఇది సుమారుగా 45 కేజీల వరకు బరువు ఉంటుంది. దీంతో అప్రమత్తమైన మత్స్యకారులు భయంతో పరిగెత్తారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి పాత చెరువు నిండిపోవడంతో మత్సకారులు చేపలు పట్టేందుకు వల వేశారు.

నిబంధనల మేరకే ‘స్పాట్’ బిల్లుల చెల్లింపు

విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజనీర్ భాస్కర్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: విద్యుత్ కనెక్షన్ల స్పాట్ బిల్లింగ్‌కు సంబంధించిన చార్జీల చెల్లింపుల్లో నిబంధనల మేరకు ముందుకెళ్తామని విద్యుత్‌శాఖ పటాన్‌చెరు డివిజనల్ ఇంజనీర్ భాస్కర్ రావు స్పష్టం చేశారు. శనివారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం లేని బిల్లుల డాక్యుమెంట్లను రిజెక్టు చేశామన్నారు. స్పాట్ బిల్లింగ్ చార్జీల చెల్లింపుల్లో జరుగుతున్న అవకతవకలపై ‘సాక్షి’లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా బిల్లింగ్ చార్జీల డాక్యుమెంట్లు పెట్టిన కాంట్రాక్టరుకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. ఆయా సెక్షన్ల ఏఈల నుంచి అప్రూవల్ వచ్చేకే ఈ చార్జీల చెల్లింపులు ఉంటాయని, ఏఈలు నిబంధనలకు విరుద్ధంగా అప్రూవల్ చేస్తే వారు కూడా బాధ్యులు అవుతారని వివరించారు.

నిబంధనలు పట్టవా..?

ఇష్టానుసారంగా ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణ

- బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ గాలికి..
- కనీస పారిశుద్ధ్య చర్యలు పాటించని వైనం
- డెంగీ వంటి రోగాల పేరుతో నిలువు దోపిడీ
- అధికారుల తనిఖీల్లో వెల్లడవుతున్న ఆగడాలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఆస్పత్రిలో రోగులకు ఆపరేషన్లు చేసిన సందర్భంగా వచ్చే బయోమెడికల్ వేస్ట్‌ను నిబంధనల మేరకు నిర్వహించాలి. లేని పక్షంలో ఇది ఆస్పత్రికి వచ్చే ఇతరులకు కూడా ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది. కానీ సంగారెడ్డిలోని పొత్తిరెడ్డిపల్లి చౌరస్తాలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఈ బయోమెడికల్ వేస్ట్ నిర్వహణ గాలికొదిలేసినట్లు ఇటీవల అధికారులు చేసిన తనిఖీలో తేలింది. దీంతో ఆ ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసులు ఇచ్చారు.

- సంగారెడ్డి బైపాస్‌రోడ్డులోని మరో ఆసుపత్రిలో జ్వరంతో బాధపడుతున్న ఓ రోగికి ర్యాపిడ్‌కార్డ్ టెస్ట్ చేసి డెంగీ వచ్చిందని భయభ్రాంతులకు గురి చేశారు. నిబంధనల ప్రకారం ర్యాపిడ్ కార్డ్ టెస్ట్‌లో పాజిటివ్ వస్తే.. ఎలిసా టెస్టు చేశాకే డెంగీగా నిర్ధారించాలి. కానీ ఈ ఎలిసా టెస్టు చేయకుండానే డెంగీగా నిర్ధారించి బిల్లులు వసూలు చేసిన ఈ ఆస్పత్రి ల్యాబ్‌ను సీజ్ చేశారు.
- జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు కనీస నిబంధనలు పాటించడం లేదు. ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న పలు ఆస్పత్రులు కనీసం పారిశుద్ధ్యం నిర్వహణను కూడా గాలికొదిలేయడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ముఖ్యంగా ఆపరేషన్లు, ఇతర చికిత్సలు చేసినప్పుడు వచ్చే బయోమెడికల్ వేస్టేజీను ఇష్టానుసారంగా పారవేస్తున్నారు. నిబంధనల మేరకు ఈ బయోమెడికల్ వేస్టేజీను మెయింటేన్ చేయకపోతే ఆస్పత్రిలోని ఇతర రోగులకే కాదు, అక్కడికి వచ్చే సామాన్యులకు కూడా ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంటుంది. మరోవైపు రోగనిర్ధారణ పరీక్షల విషయంలోనూ ఆస్పత్రులు జిమ్మిక్కులకు పాల్పడుతున్నాయి. ఇష్టానుసారంగా టెస్టులు చేసి రోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మెరుగైన వైద్యం అందుతుందనే ఆశతో వచ్చిన అమాయక రోగులను అందినకాడికి దోచుకుంటున్నారు. జిల్లాలో వైద్యుల పర్యవేక్షణలో ఏడు ప్రత్యేక బృందాలు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీలు చేస్తున్నాయి. ఈ తనిఖీల్లో ఆయా ఆస్పత్రుల ఆగడాలు వెలుగులోకి వస్తున్నాయి.

జిల్లాలో 578 వైద్య సంస్థలు

జిల్లాలో వైద్యరోగ్యశాఖ నుంచి అనుమతి పొందిన వైద్య సంస్థలు 578 ఉన్నాయి. ఇందులో హాస్పిటళ్లు 182, క్లినిక్‌లు 139, డెంటల్ హాస్పిటళ్లు 77, ఫిజియోథెరపీ యూనిట్లు 13, రోగనిర్ధారణ కేంద్రాలు 135, ఆయుష్ క్లినిక్‌లు 32 ఉన్నాయి. ఈ ఆస్పత్రులన్నీ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం ఆస్పత్రులను నిర్వహించాలి. ఈ చట్టంలోని నిబంధనలను కచ్చితంగా పాటించాలి. కానీ చాలావరకు ప్రైవేట్ ఆస్పత్రులు ఈ నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. రోగులు వస్తే చాలు రూ.లక్షల్లో బిల్లులు వేసి అందినకాడికి దండుకుంటున్నాయి. రోగుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దోపిడీకి గురి చేస్తున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీలు కొనసాగుతాయి



ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు నిరంతర ప్రక్రియ. తప్పకుండా నిబంధనలు పాటించాలి. లేనిపక్షంలో యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ గాయత్రీదేవి, డీఎంహెచ్‌ఓ

న్యాయమూర్తితో కమిటీ వేయాలి



మాట్లాడుతున్న నాయకులు

జోగిపేట (అందోల్): ఎస్సీ ఎస్టీ వర్గీకరణ అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే ఉప సంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అందోలు మల్లేశం డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీల అభిప్రాయాన్ని సేకరించకుండా వర్గీకరణ అమలు పేరుతో కమిటీ వేయడం సమంజసం కాదన్నారు. ఏ ఒక్క మాల మంత్రి లేకుండా కమిటీని ఎలా నియస్తారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో మాదిగల జనాభా కంటే మాల, మాల ఉప కులాల జనాభా ఎక్కువగా ఉందని, ఉత్తమ్ కుమార్ రెడ్డి కమిటీతో ఎలాంటి న్యాయం జరగదని స్పష్టం చేశారు. మంత్రుల కమిటీని రద్దు చేసి సిట్టింగ్ న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు దీనబాండవ్, నియోజకవర్గ నాయకులు మ్యాతరి కరుణాకర్, మండల ఉపాధ్యక్షుడు పరిపూర్ణం, మండల ముఖ్య సలహాదారులు బహుజన ప్రసాద్, సటికే రాజు, దాసరి దుర్గయ్య, పెండ గోపాల్, చెట్టయ్య, అరుణ్ పాల్గొన్నారు.

రెండు డీఏలకు త్వరలో మోక్షం!

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువు భత్యం(డీఏ) బకాయిలు త్వరలో ప్రభుత్వం చెల్లించనుందని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ పేర్కొన్నారు. పట్టణంలోని బంజార భవనంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సమవేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల విన్నపాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని, త్వరగా రెండు డీఏలను మంజూరు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్ గోపాల్ మాట్లాడుతూ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్స్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిక సంపాదకులు మాణయ్య మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలకు పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరి చేయాలన్నారు. సమావేశంలో జహీరాబాద్ మండల అధ్యక్ష కార్యదర్శులు తులసీరాం రాథోడ్, శ్రీశైలం, నాయకులు వరాలు, శ్రీనివాస్, సురేందర్,బాలయ్య, నర్సయ్య, ప్రదీప్ కుమార్, శివరాజ్, అర్జున్ చవాన్, నాగయ్యస్వామి, రమేశ్ బాణోత్ పాల్గొన్నారు.



లంబోదరుడికి 56 రకాల ప్రసాదాలు

సంగారెడ్డి పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గీతానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్యకు శనివారం 56 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు.

– సంగారెడ్డి అర్బన్

టీచర్లపై సీఎం వ్యాఖ్యలు సరికాదు: హరీశ్ రావు

సిద్దిపేటకమాన్: విద్య విషయంలో తల్లిదండ్రులు రాజీ పడడం లేదని, పిల్లలను బాగా చదివించడమే ఒక ఆస్తి అనే భావన తల్లిదండ్రులలో వచ్చి ందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పోలీసు కన్వెన్షన్ హాల్‌లో ట్రిస్మా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గురు పూజోత్సవలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలో పనిచేసే 242 మంది ఉత్తమ టీచర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల చిత్తశుద్ధితో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. సిద్దిపేట జిల్లాకు ప్రత్యేకత ఉందని, వీరి ప్రయత్నం, కృషి వల్లే పదవ తరగతి ఫలితాల్లో సిద్దిపేట అగ్రగామిగా ఉందన్నారు. కొద్ది తేడాతో రెండవ స్థానంలో ఉన్నామన్నారు. సీఎం రేవంత్ ప్రసంగం చూశానని ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల మధ్య తేడా చూపుతూ చెప్పడం దురదృష్టకరమన్నారు.

అతివలకు ప్రోత్సాహం

- మహిళా శక్తి ద్వారా వడ్డీలేని రుణం
- 13 రకాల యూనిట్లకు అవకాశం
- నిర్దేశిత లక్ష్యం వైపు అధికారుల అడుగులు



జిల్లాలోని మహిళా సంఘాలు	18,756
సంఘాలలో ఉన్న సభ్యులు	1,90,381
జిల్లాలో గ్రామ సమైక్య సంఘాలు	695

సంగారెడ్డిజోన్: గ్రామీణ మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలనే సదుద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా శక్తి పథకానికి శ్రీకారం చుట్టింది. మహిళా సంఘాలకు ఇందిరా మహిళ శక్తి పేరుతో రుణ సౌకర్యం కల్పిస్తుంది. సంఘాలలోని అర్హత కలిగిన సభ్యులను గుర్తించి అధికారులు రుణాలు అందిస్తున్నారు. ఈ రుణాల ద్వారా చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహిస్తూ సంఘాల బలోపేతమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలని అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

12,607 యూనిట్లు అందించాలని లక్ష్యం

మహిళా శక్తి ద్వారా జిల్లాలో 12,607 యూనిట్ల రుణాలు అందించాలని లక్ష్యం నిర్దేశించగా... ఇప్పటివరకు 4,110 యూనిట్లు మంజూరు చేసినట్లు డీఆర్‌డీఓ అధికారులు వివరించారు. యూనిట్‌ను బట్టి రుణం ఇవ్వనున్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధికి సంబంధం లేకుండా మహిళా శక్తి ద్వారా రూ.136కోట్లు రుణాలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్దేశించిన లక్ష్యం, నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు అడుగులు వేస్తున్నారు.

13 రకాల యూనిట్ల మంజూరు

ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు 13రకాల యూనిట్లకు మంజూరుకు అవకాశం కల్పించింది. మహిళలు తమకున్న నైపుణ్యం, ఆసక్తి ఉన్న వ్యాపారాలకు రుణం మంజూరు చేస్తున్నారు. అందులో భాగంగా మైక్రో ఎంటర్ ప్రైజెస్(చిన్న తరహా పరిశ్రమలు), పాడి గేదెలు, పెరటి కోళ్ల పెంపకం, కోళ్ల ఫామ్ మదర్ యూనిట్, సంచార చేపల అవుట్ లెట్, డెయిరీ పార్లర్, మీసేవ కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా క్యాంటీన్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రీసైక్లింగ్ యూనిట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, కష్టం హైరింగ్ కేంద్రాలు, యూనిఫామ్ కుట్టు కేంద్రాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. యూనిట్ల గ్రౌండింగ్ పై కలెక్టర్ క్రాంతి ఇటీవల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. రుణాల అందజేతను వేగవంతం చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు యూనిట్ల గ్రౌండింగ్ త్వరితగతిన పూర్తి చేసేందుకు బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో 5 క్యాంటీన్లు

మహిళా శక్తిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఐదు క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. సంగారెడ్డి, జహీరాబాద్(కొత్తూర్ బి), ఝరాసంగం, హత్నూర(నస్తీపూర్)లో క్యాంటీన్ల ఏర్పాటుకు పనులు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే పటాన్ చెరు(చిట్కుల్)లో క్యాంటీన్ ప్రారంభమైనట్లు వివరించారు.

రూ.2 లక్షలతో మిల్క్ పార్లర్ ఏర్పాటు



ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రూ.2 లక్షలతో మిల్క్ పార్లర్ కేంద్రాన్ని కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేయడం జరిగింది. రోజుకి రూ.55,000 గిరాకీ అవుతుంది. అందులో రూ.800వరకు మిగులుతున్నాయి.

– భారతమ్మ, నిర్వాహకురాలు, సంగారెడ్డి

మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యం



గ్రామాలలో మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంపై సంఘం సభ్యులకు రుణాలు అందిస్తున్నాం. మహిళలు నైపుణ్యం కలిగిన రంగాలపై యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు రుణం అందిస్తున్నాం. సభ్యులందరూ రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలి.

– జ్యోతి, డీఆర్డీఓ

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

జహీరాబాద్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని మాజీ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. శనివారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయన్నారు. దీంతో బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. అసెంబ్లీ కన్వీనర్ ఎస్.జగన్నాథ్, ఎం.శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, జి.భాస్కర్, బక్కయ్య, మంజుల సంతోష్ పాల్గొన్నారు.

కరాటే శిక్షణ.. బాలికలకు ఆత్మరక్షణ

- విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే లక్ష్యం
- జిల్లాలో 250 పాఠశాలలు ఎంపిక
- రూ. 37.50 లక్షల నిధులు మంజూరు
- వచ్చేనెల నుంచి శిక్షణ ప్రారంభం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఉదయం ఇంటి నుంచి బడికి వెళ్లిన చిన్నారులు సాయంత్రం ఇంటికి క్షేమంగా చేరే వరకు తల్లిదండ్రులకు నిత్యం టెన్షన్ తప్పడం లేదు. సమాజంలో బాలికలు ఏదో విధంగా వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఒంటరిగా బయటకు వెళ్తే చాలు ఆకతాయిలు, పోకిరీల ఆగడాలు, వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రధానంగా అత్యాచారాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి బాలికలకు ఆత్మరక్షణ విద్య అవసరం ఎంతైనా ఉంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం.. పాఠశాల స్థాయి నుంచే బాలికలకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటుంది. ‘రాణి ఝాన్సీలక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్’ పేరుతో కరాటేలో శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

జిల్లాలో 250 పాఠశాలల్లో శిక్షణ

కరాటేలో శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలోని 29 ప్రభుత్వ ప్రాథమికోన్నత, 221 ఉన్నత పాఠశాలను ఎంపిక చేశారు. 6 నుంచి 10 వ తరగతి చదివే బాలికలకు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు గాను ప్రభుత్వం రూ 37.50 లక్షల నిధులను మంజూరు చేసింది. వచ్చే నెల నుంచి మూడు నెలల్లో 36 శిక్షణ తరగతుల చొప్పున జనవరి చివరి వరకు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. వారంలో మూడు రోజుల పాటు నెలకు 12 తరగతులు చొప్పున నిపుణులైన కరాటే శిక్షకులచే తర్ఫీదు ఇవ్వనున్నారు.



ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్(ఫైల్)

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

కరాటే శిక్షణతో బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో బాలికలకు మూడు నెలల పాటు ఆత్మరక్షణపై శిక్షణ తరగతులను నిర్వహించనున్నం. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. కరాటే మాస్టర్లను ఎంపిక చేస్తున్నాం. మహిళా మాస్టర్లకు అవకాశం ఉంటుంది.

– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

ఆత్మస్థైర్యం నింపేలా..

బాలికలకు పాఠశాల స్థాయి నుంచే కరాటేలో శిక్షణ ఇవ్వడం వల్ల వారిలో ఆత్మస్థైర్యం నింపడంతో పాటు మానసిక దృఢత్వం పెంపొందనుంది. విద్యార్థినులు, యువతుల రక్షణ కోసం షీ టీంలు, తదితర వాటితో వివిధ రకాలుగా తోడ్పాటునందిస్తున్నాయి. అదేకోవలో వారికి స్వీయరక్షణ కల్పిస్తూ భరోసా నింపాలన్న ఉద్దేశంతో రాష్ట్ర విద్యా శాఖ ప్రభుత్వ విద్యాలయాల్లో ఆత్మరక్షణ కార్యక్రమాన్ని చేపట్టింది. బాలికల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తోంది. అనుచిత పరిస్థితులు ఎదురైనప్పుడు బాలికలే స్వయంగా ప్రతిఘటించడంతో పాటు ప్రమాదం నుంచి బయటపడేలా మెళుకువలను ఈ శిక్షణలో నేర్పనున్నారు. శిక్షకులకు నెలకు రూ.5 వేల చొప్పున మూడు నెలలకు ఒక్కొక్కరికి రూ.15 వేలు పారితోషికం చెల్లించనున్నారు.

ఫ్లాష్ మాబ్.. కొత్త ట్రెండ్

రోడ్లపై విద్యార్థుల నృత్యాలు


ఫెస్ట్ ఉందని ఫ్లాష్ మాబ్ ద్వారా ప్రచారం చేస్తున్న మెడికల్ కళాశాల విద్యార్థులు

సాక్షి, సిద్దిపేట: విద్యార్థులు రోడ్ల పై డ్యాన్స్‌లు చేస్తున్నారేంటి అనుకుంటున్నారా... ఇలా డ్యాన్స్ వేయడం వెనుక ఓ సదుద్దేశ్యం ఉంటుంది. ఆ ఉద్దేశాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ఫ్లాష్ మాబ్‌ను యువత, విద్యార్థులు ఎంచుకుంటున్నారు. ఇతర దేశాల్లో మొదలైన ఫ్లాష్ మాబ్ సంస్కృతి ఇప్పుడు మన పట్టణాలకు పాకింది. బహిరంగ ప్రదేశాలు బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు, చౌరస్తాల్లో ఉన్నట్టుండి యువత డ్యాన్సులు చేయడాన్ని ఫ్లాష్ మాబ్‌గా పిలుస్తారు. ఈవెంట్‌లు, ఫెస్ట్‌లు, వార్షికోత్సవాలతోపాటు ప్రజలకు ఏదైనా అంశంపై ఫ్లాష్ మాబ్ ద్వారా యువత, విద్యార్థులు అవగాహన కల్పిస్తున్నారు.

ఏమిటీ ఫ్లాష్ మాబ్

ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో 20 మందికి పైగా విద్యార్థులు చేరుకుంటారు. ముందుగా సిద్ధం చేసుకున్న డీజే సౌండ్‌కు అనుగుణంగా ఓ విద్యార్థి డ్యాన్స్ చేయడం ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఒక్కొక్కరు చేరి గుంపుగా డ్యాన్స్ చేస్తుండటంతో ఏదో జరుగుతుందన్న ఆసక్తితో ప్రజలు గుమిగూడుతారు. ఇంకేముంది అరగంట పాటు డ్యాన్స్ చేసిన అనంతరం వివిధ అంశాలపై అవగాహన, కళాశాలలో నిర్వహించే ఫెస్ట్ తేదీ, ఎవరెవరు వస్తున్నారని వివరిస్తారు. ఏదైనా అంశం ఉంటే దాని వల్ల కలిగే ఉపయోగాలు మైక్ ద్వారా వివరిస్తారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఇతర దేశాల్లో ప్రారంభమైన ఈ ఫ్లాష్ మాబ్ మన దేశంలో మొదట ముంబైలోని ఐఐటీ విద్యార్థులు చేసినట్లు ఇక్కడి విద్యార్థులు చెప్పుకొచ్చారు. మొదట అక్కడి విద్యార్థులు తమ కళాశాలల్లో జరిగే కార్యక్రమానికి ఎంత ప్రచారం చేసినా.. ఎన్ని డబ్బులు ఖర్చు పెట్టినా.. ఫలితం లేకపోవడంతో.. తక్కువ ఖర్చుతో ప్రచారం కల్పించేందుకు ఏం చేయాలి అని ఆలోచించారు. ఇతర దేశాల్లో కొనసాగుతున్న ఈ ఫ్లాష్ మాబ్ ద్వారా ప్రచారం చేద్దామని ప్రారంభించారు. ఈ సంస్కృతి ఉమ్మడి మెదక్ జిల్లా వరకు పాకింది.

విద్యార్థులకు పోటీలు సైతం

ఫ్లాష్ మాబ్ నిర్వహించే క్రమంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. డిబెట్‌లు, బెలూన్ గేమ్, నాటకాలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు సైతం అందజేస్తున్నారు. దీంతో సొంత కళాశాల విద్యార్థులే కాదు మిగితా వారు కూడా పోటీల్లో ఆసక్తిగా పాల్గొంటున్నారు. అంతే కాకుండా విద్యార్థులు చేపట్టిన ప్రచారానికి మంచి స్పందన లభిస్తోంది.


ప్లకార్డులతో మెడికల్ కళాశాల విద్యార్థులు


డ్రగ్స్ వాడొద్దని అవగాహన కల్పిస్తున్న మెడికోలు

ప్రత్యేక రోజులపై అవగాహన

ఏదైనా ప్రత్యేక రోజు వచ్చిందంటే చాలు అధికారులు, పోలీసుల సమక్షంలో విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎర్త్ డే, ఆత్మహత్యల నివారణపై, డ్రగ్స్ నిర్మూలన, ప్రమాదాల నివారణ వంటి అంశాలపై అవగాహన చేస్తూ ప్రజల్లో మార్పు తేవడానికి తమ కృషి చేస్తున్నారు. ఇటీవలె ఆత్మహత్యలు వద్దు.. ప్రతీ జీవితం ప్రత్యేకమైనది అంటూ సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు సిద్దిపేట పట్టణంలో ఇటీవల ఫ్లాష్ మాబ్‌ను నిర్వహించారు. సిద్దిపేట బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తాలో, ప్రభుత్వాస్పత్రిలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో ఈ ఫ్లాష్ మాబ్ కొనసాగింది. ఆటలు, నృత్యాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్‌బాబు, వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొనడం విశేషం. అలాగే ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు వైద్య కళాశాల ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నామని కార్యక్రమం చేపట్టారు. సిద్దిపేట పట్టణంలోని క్రాంతి స్కూల్ విద్యార్థులు వినూత్నంగా ఎర్త్ డే సందర్భంగా ఫ్లాష్ మాబ్‌ను నిర్వహించారు. సంగారెడ్డిలో మెడికల్ కళాశాల విద్యార్థులు డ్రగ్స్‌ను వినియోగించొద్దని, దాని వల్ల కలిగే నష్టాలపై వివరించారు. ఇలా ఎక్కడో ఒక చోట ప్రజలల్లో అవగాహ కల్పించేందుకు ఫ్లాష్ మాబ్ చేస్తున్నారు.


రోడ్డుపై నృత్యం చేస్తున్న మెడికల్ కళాశాల విద్యార్థులు

అవగాహన కల్పించేందుకు..



ఎర్త్ డే సందర్భంగా మా విద్యార్థులతో ఫ్లాష్ మాబ్ చేయించాం విద్యార్థులు డ్యాన్స్‌లు వేస్తూ ప్రజలకు అవగాహన కల్పించొచ్చని ఉద్దేశ్యంతో ఫ్లాష్ మాబ్ కార్యక్రమం చేపట్టాం. ప్రజలు అందరూ డ్యాన్స్‌లను తిలకించారు.. అలాగే పర్యావరణంపై అవగాహన సైతం కల్పించాం. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషకరం.

– భగవాన్ రెడ్డి, కరస్పాండెంట్, క్రాంతి స్కూల్, సిద్దిపేట

17న మా కాలేజీలో ఫెస్ట్..



మా మెడికల్ కళాశాలలో 17 నుంచి 21వ తేదీ వరకు ఫెస్ట్ జరుగుతుంది. దాని గురించి ప్రజలకు తెలిపాం. ఏ విషయం మీదనైనా ప్రజలకు అవగాహన కల్పించాలంటే కరపత్రాలు, వివిధ ప్రకటనల ద్వారా తెలియజేసే వాళ్లం. ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా ఫ్లాష్ మాబ్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

– డాక్టర్ శ్రీనివాస్, పీజీ విద్యార్థి, సిద్దిపేట


సంగారెడ్డిలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

మద్దూరు(హుస్నాబాద్): పోక్సో కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. చేర్యాల మండలంలోని అర్జున్‌పట్ల గ్రామానికి చెందిన తాళ్లపల్లి శివ అనే వ్యక్తి మహారాష్ట్ర కు చెందిన బాలికకు మూడేళ్లుగా మాయమాటలు చెప్పి లోబర్చుకొని లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో రూ.4.60 లక్షలు బురిడీ

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైమ్ జాబ్ పేరుతో సైబర్ నేరగాడు ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బురిడీ కొట్టించాడు. అతడి వద్ద భారీ ఎత్తున నగదు కాజేసిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని కిష్టారెడ్డిపేట్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మార్చి 18న పార్ట్‌టైమ్ జాబ్, ఆన్‌లైన్ టాస్కులు అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు ఉద్యోగి నుంచి నగదు పెట్టిస్తూ టాస్కులు ఇస్తూ వచ్చారు. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా రూ.1,000 నుంచి ప్రారంభించి, రూ.4.60 లక్షల వరకు బాధితులు చెల్లించాడు. చివరికి అపరిచిత వ్యక్తి స్పందించకపోవడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, శనివారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చిత్తూరు రోడ్డు ప్రమాద మృతుల్లో సిద్దిపేట వాసి


రాజేంద్ర (ఫైల్)

సిద్దిపేటజోన్: చిత్తూరు జిల్లా తిరుపతి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారిలో సిద్దిపేటవాసి బల్ల రాజేంద్ర ఒకరు. సిద్దిపేటలోని ప్రశాంత్ నగర్‌కు చెందిన రాజేంద్ర చాలా ఏళ్లుగా ఫొటోగ్రాఫర్‌గా జీవనోపాధి సాగిస్తున్నాడు. రెండేళ్ల కిందట కుటుంబంతో సహా బతుకుదెరువు కోసం నిర్మల్ వలస వెళ్లి ఫొటో గ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. కుమారుడు శివకుమార్‌తో కలిసి తిరుపతి వెళ్లి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో మొగిలి ఘాట్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. కుమారుడు శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 35 ఏళ్లు సిద్దిపేటలో ఫొటోగ్రాఫర్‌గా కొనసాగిన రాజేంద్ర మృతిపై ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ సంతాపం వ్యక్తం చేసి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చెరువులో స్నానానికి వెళ్లి..

ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతి


శ్రీనివాస్ (ఫైల్)

నర్సాపూర్ : చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఆవంచ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ లింగం కథనం మేరకు.. గ్రామానికి చెందిన గంట శ్రీనివాస్(25) వృత్తి రీత్యా ట్రాక్టర్ డ్రైవర్, శనివారం ట్రాక్టర్‌ను కడిగేందుకు చెరువులోకి వెళ్లాడు. ట్రాక్టర్‌ను కడిగిన అనంతరం స్నానం చేస్తుండగా ఈత రానందున ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. మృతుడి తల్లి భూమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లింగం తెలిపారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సులభంగా డబ్బు సంపాదించాలని..

- బైక్ చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి
- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): జల్సాలకు అలవాటు పడి బైక్‌ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం వెల్లడించారు. మండల పరిధి రూప్లా పంచాయతీకి చెందిన జర్పుల మోహన్ ఓ చోరీ కేసులో అదుపులోకి తీసుకొని విచారించగా బైక్ చోరీల విషయం వెలుగులోకి వచ్చింది. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యం ఇళ్ల ఎదుట, పార్కింగ్ ప్రదేశాల్లో, రోడ్ల పక్కన నిలిపి ఉంచిన బైక్‌లను చోరీ చేస్తున్నాడు. శివ్వంపేట, నార్సింగి, మనోహరాబాద్, కొల్చారం, కూకట్‌పల్లి, సనత్‌నగర్, ఏరియాల్లో 17 బైక్‌లు, స్కూటీ చోరీ చేశాడు. ఈ బైక్‌లను నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎర్ల నరేశ్ తక్కువ ధరకు కొనుగోలు చేసి పలు ప్రాంతాల్లో విక్రయించినట్లు తేలింది. నరేశ్‌ను కూడా అదుపులోకి తీసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. శనివారం జర్పుల మోహన్‌ని రిమాండ్‌కు తరలించామన్నారు. దొంగలను పట్టుకోవడంలో సీసీఎస్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పని చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగాకృష్ణ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ తిరుమలేశ్, ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పాడె కట్టిన గంటల వ్యవధిలోనే..

- తానూ పాడె ఎక్కాడు
- రక్తపు వాంతులతో మేకల పోచయ్య మృతి
- ఎల్లాపూర్ గ్రామంలో విషాదం


పోచయ్య(ఫైల్)

పాపన్నపేట(మెదక్): మృత్యువు ఎవరికి ఎలా ముంచుకొస్తుందో ఎవరికి ఎరుక అన్నట్లు.. పొద్దున పొరిగింటి వ్యక్తి పాడె కట్టిన ఓ అభాగ్యుడు గంటల వ్యవధిలోనే తాను పాడె ఎక్కిన ఘటన మండల పరిధిలోని ఎల్లాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన తాడెపు సుధాకర్ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి కన్నుమూశాడు. పక్కింటికి చెందిన మేకల పోచయ్య (65) శుక్రవారం సుధాకర్ అంత్యక్రియల్లో అన్నీ తానై వ్యవహరించాడు. తానే పాడె కట్టాడు.. మృతుడి రక్త సంబంధీకులతో కలిసి అంతిమ యాత్రలో పాల్గొన్నాడు. రాత్రి ఇంటికొచ్చి చుట్టు ప్రక్కల వాళ్లతో కలిసి ముచ్చటించాడు. ఉన్నట్టుండి రాత్రి 12.30 గంటల ప్రాంతంలో రక్తంతో వాంతులు చేసుకున్నాడు. కుటుంబీకులు వెంటనే మెదక్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం తెల్లవారు జామున పోచయ్య మరణ వార్త గుప్పు మనడంతో ఊరంతా కన్నీరు మున్నీరయ్యారు. మూడేళ్ల కిందటే మల్లేశం భార్య చనిపోగా ప్రస్తుతం కూతురు మల్లీశ్వరితో కలిసి నివసిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి రూ.5 వేలు, కొత్తపల్లి సొసైటీ డైరెక్టర్ తాడెపు మహిపాల్, వేణుగోపాల్, ప్రదీప్ చెరో రూ.వెయ్యి ఆర్థిక సహాయం చేశారు.

కేబుల్ వైర్ల దొంగకు దేహశుద్ధి

పోలీసులకు అప్పగింత


దొంగను కట్టేసిన గ్రామస్తులు

తూప్రాన్: వ్యవసాయ బోరు బావుల వద్ద విద్యుత్ కేబుల్ వైర్లు దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ శివానందం శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో నివాసం ఉంటున్న రాంసింగ్ అనే వ్యక్తి కొంతకాలంగా రాత్రి సమయాల్లో బోరుబావుల వద్ద విద్యుత్ వైర్లు కత్తిరించి తగులబెట్టి కాపర్ వైరును అమ్ముకుంటున్నాడు. శుక్రవారం రాత్రి పట్టణంలోని గీతారెడ్డి కాలనీ సమీపంలో ఇలానే విద్యుత్ వైర్లు కత్తిరించి మంటల్లో వేశాడు. ఇది గుర్తించిన స్థానికులు పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

గజ్వేల్‌రూరల్: తాళం వేసిన ఇళ్లలో చోరీలకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు గజ్వేల్ అదనపు సీఐ ముత్యంరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల పరిధిలోని దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన క్యాసారం సత్తవ్వ 9న కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి 11న ఇంటికి వచ్చి తాళం తీసి చూడగా బీరువాలోని రూ.80 వేల నగదు, 20 తులాల వెండి పట్ట గొలుసులు కనిపించలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఇదే గ్రామానికి చెందిన సిర్సనగండ్ల మల్లయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకొని నగదు, వెండి రికవరీ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించామన్నారు. కేసును త్వరగా ఛేదించిన గజ్వేల్ సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు, ఏఎస్ఐలు యాదగిరి, పండరి, పోలీస్ సిబ్బంది నవీన్, రవి, నరేందర్, వెంకటేశ్‌లను ఏసీపీ పురుషోత్తం రెడ్డి అభినందించారు.

గ్రామస్తులే దొంగలు

ఇద్దరిని పోలీసులకు అప్పగింత

చేగుంట(తూప్రాన్): గుడిలో చోరీ చేసిన దొంగలను పట్టుకొని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని చందాయిపేట గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో పెద్ద గంట, మల్లన్న దేవాలయంలో వెండి వస్తువులు, నాలుగు నెలల హుండీ డబ్బులు శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయి. శనివారం ఉదయం ఆలయాల్లో చోరీ జరిగిన విషయం తెలుసుకొని స్థానికులు అనుమానితులైన స్వామి, వెంకటేశ్‌లను గ్రామచావిడి వద్దకు పిలిపించారు. పంచాయితీ పెట్టి నిలయదీయగా దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో పోలీసులకు అప్పగించారు.

ఆటోను ఢీకొట్టిన కారు

– అక్కడికక్కడే ఆటో డ్రైవర్ మృతి


ప్రభాకర్ (ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): ఆటోను కారు ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ మండల పరిధిలోని మాచవరం గేటు సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొల్చారం మండలం అంసాన్‌పల్లి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి ప్రభాకర్ (40) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి మెదక్‌లో ప్యాసింజర్‌ను దింపి వేస్తున్న క్రమంలో మాచవరం గేటు సమీపంలో హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రభాకర్ ఆటోనే ఇరుక్కుపోయాడు. మెదక్ రూరల్ ఎస్ఐ మురళీ జేసీబీ సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అమృత, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఇద్దరు యువకులకు గాయాలు

మనోహరాబాద్(తూప్రాన్): బైక్‌ను బొలేరో వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. శనివారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మనోహరాబాద్‌కు చెందిన ర్యాకల సాయి సుశాంత్, వంగాల అభిలాష్‌రెడ్డి శుక్రవారం బైక్‌పై పని నిమిత్తం కాళ్లకల్ వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. అలాగే మహారాష్ట్రకు చెందిన బొలేరో వాహనం హైదరాబాద్ నుంచి తూప్రాన్ వెళ్తుంది. మనోహరాబాద్‌కు రాగానే వేగంగా వస్తున్న బొలేరో అదుపుతప్పి యువకులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయి సుశాంత్ తలకు తీవ్ర గాయాలు, అభిలాష్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడు సాయి సోదరుడు ర్యాకల సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య


రమేశ్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): మద్యం తాగొద్దని మందలించడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. తిప్పారం గ్రామానికి చెందిన పోటోళ్ల రమేశ్(40) మద్యానికి బానిసయ్యాడు. ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చాడు. రోజు మద్యం తాగితే కుటుంబం, పిల్లలు ఏమైపోవాలని భార్య పోషవ్వ భర్తను మందలించింది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రమేశ్ కొద్దిసేపటికి దూలానికి ఉరి వేసుకున్నాడు. రమేశ్ పెద్దగా శబ్దం చేయడంతో భార్య చూసి పక్కింటి వారి సాయంతో కిందికి దింపి గజ్వేల్ ప్ర భుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

గుమ్మడిదలలో యువకుడు

పటాన్‌చెరు టౌన్: యువకుడు ఆత్మహత్య పాల్పడిన ఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం.. బీహార్‌కి చెందిన డిభాకర్ (19) ఆరు నెలల కిందట వచ్చి అన్నారం ఎయిర్ ఫోర్స్ అకాడమీలో అనిల్‌కుమార్ వద్ద కాంట్రాక్ట్ లేబర్‌గా పని చేస్తున్నాడు. అక్కడే రేకుల షెడ్‌లో ఉంటున్నాడు. శనివారం ఉదయం తాను ఉండే రూమ్‌లో రాడ్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. ఇది గమనించిన స్థానికులు, స్నేహితులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి బాబాయ్ రవీందర్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


కొంతన్‌పల్లి గ్రామంలో మహిళ


జయమ్మ(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్):మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధి కొంతన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బుడిగే జయమ్మ(55) ఆర్థిక ఇబ్బందులతోపాటు కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైంది. దీంతో శనివారం ఇంట్లో నుంచి పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



గుర్రపు డెక్కతో కళావిహీనంగా కనిపిస్తున్న మహబూబ్ సాగర్ చెరువు



డెక్క తొలగించటంతో అందంగా కనిపిస్తున్న చెరువు

గతంలో సంగారెడ్డి మహబూబ్ సాగర్ చెరువు అంతా గుర్రపు డెక్క వ్యాపించి కళావిహీనంగా కనిపించేది. చెత్తాచెదారం పేరుకుపోయి నీళ్లన్నీ కలుషితమయ్యాయి. చెరువంతా నీళ్లు కనిపించకుండా పచ్చిక మైదానాన్ని తలపించేది. కట్టపై ఎక్కడ చూసినా దుర్గంధం వచ్చేది. అది తెలుసుకున్న సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని చెరువును శుభ్రం చేయించాడు. మున్సిపల్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేస్తూ గుర్రపు డెక్క మొత్తంగా తొలగిపోయేలా చేయటంతో చెరువు చూడటానికి అందంగా కనిపిస్తుంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి